ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 6 ఆగస్టు 2024

'స్వచ్ఛదనం పచ్చదనం'లో భాగస్వాములు కావాలి 8లో..

మహిళలు ఆదాయ వనరులు సృష్టించాలి 8లో..

రామగుండం ఎన్టీపీసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలి


కార్యక్రమంలో రామగుండం అధికారులు

జ్యోతినగర్, ఆగస్టు 5 : రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ఎస్టీపీపీ ప్రాజెక్టులలో కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టాలని గుర్తింపు కార్మిక సంఘం మజ్దూర్ యూనియన్(ఐఎన్టీయూసీ) అధ్యక్ష, కార్యదర్శులు ఆరెపల్లి రాజేశ్వర్, యుగంధర్‌రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని దక్షిణ రీజియన్ ముఖ్య కార్యాలయం(ఎస్ఆర్ హెచ్‌క్యూ)లో సోమవారం జరిగిన ఆర్‌సీఎం (రీజినల్ కమ్యూనికేషన్ మీటింగ్), ఆర్‌జెపిసి సమావేశంలో గుర్తింపు యూనియన్ పలు అంశాలను లేవనెత్తింది. ఎన్టీపీసీలో ప్రతి నెల పదుల సంఖ్యలో ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నప్పటికీ కొత్త నియామకాలు చేపట్టడం లేదని, దీంతో ఉన్న ఉద్యోగులపై అధిక పనిభారం పడుతుందన్నారు. రామగుండంలో పిల్లల హోం(క్రెచ్) ఏర్పాటు చేయాలని, నోయిడాలో ఏర్పాటు చేసిన విధంగా వృద్ధాశ్రమాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని, టీఎస్టీపీపీ ప్లాంటులోని రెండు యూనిట్లు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా, రామగుండం ఎన్టీపీసీలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమై 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉద్యోగులకు బంగారు నాణెం బహూకరించాలని గుర్తింపు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రామగుండం ధన్వంతరి ఆసుపత్రిలో పర్మినెంటు స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలని, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన ఉద్యోగులకు కెరీర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(సీడీపీ) నిర్వహించి పదోన్నతులు కల్పించాలని కోరారు. సమావేశంలో రామగుండం ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

జూలపల్లి, ఆగస్టు5: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేయనున్న ప్రత్యేక కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని సీఎం సహాయ నిధి చెక్కులను అందించనున్నట్లు ఎంపిడిఓ పద్మజ తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి హాజరై చెక్కులను పొందాలని ఆమె పేర్కొన్నారు.



ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీరు

- ఈ నెల 7 నుంచి విడుదల
- ఖరారు చేసిన శివం కమిటీ
- ముందుగా ఎల్ఎండీ ఎగువ ప్రాంతానికి
- ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీటి సరఫరా

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఉత్తర తెలంగాణ జిల్లాలకు వరప్రదాయిని అయిన శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు భూములకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. ఈ నెల ఏడవ తేదీ నుంచి ఎల్ఎండి ఎగువ ప్రాంతానికి సాగునీటిని ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో విడుదల చేయాలని నిర్ణయించింది. రెండు రోజుల క్రితం హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ (శివం) సమావేశంలో ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ఎస్సా రెస్పీ ప్రాజెక్టులోకి క్రమంగా వరదనీరు వస్తుండ డంతో అధికారులు వానకాలం సీజన్లో ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 45.451 టీఎం ఎల నీళ్లు ఉన్నాయి. పైనుంచి 12,600 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో విష్ణుపురి, అందూరా, బాలేగాం ప్రాజెక్టులు నిండడంతో గేట్లు ఎత్తారు. దీంతో వరద నీరు ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి వస్తున్నది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు అక్టోబర్ 28వ తేదీ వరకు తెరిచి ఉంచడంతో వరద నీరు వచ్చేందుకు ఇబ్బందులు ఏమీ లేవు. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల వల్ల మరో 15, 20 రోజుల్లో ప్రాజెక్టు పూర్తయి నీటిమట్టం చేరుకునే అవకాశాలు ఉన్నాయని నీటి పారుదల శాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 45 టీఎంసీల నీళ్ల మాత్రమే ఉండడంతో కేవలం ఎల్ఎండీ ఎగువ ప్రాంతంలోని పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాలోని భూములకు కాకతీయ ప్రధాన కాలువ ద్వారా, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని భూములకు లక్ష్మి, సరస్వతి కాలువ ద్వారా నీటిని విడుదల చేయనున్నారు. ఎనిమిది రోజుల పాటు నీటిని విడుదల చేసి ఏడు రోజులు కాలువలను బందు చేయనున్నారు. ముందుగా 3 వేల క్యూసెక్కుల నీటిని వదిలి క్రమంగా 5000 క్యూసెక్కుల నీటిని వదలనున్నారు. ఎల్ఎండీ ఎగువ ప్రాంతంలో సుమారు నాలుగున్నర లక్షల ఎకరాల భూములకు సాగునీటిని ఇవ్వనున్నారు.

> పెద్దపెల్లి జిల్లాలో డి 83, డి 86 కాలువల కింద 1,86,000 ఎకరాల భూములు సాగుకానున్నాయి. జిల్లాలో వర్షాలు గత పది రోజుల నుంచి బాగానే కురుస్తున్నాయి. ఈ వర్షాలకు రైతులు వ్యవసాయ బావుల కింద వరి నారు పోశారు. బావుల కింద ఉన్న భూముల్లో నాటు వేయడంతో పాటు ఎస్ఆర్ఎస్పీ ఆయకట్టు కింద ఉన్న భూముల్లో కూడా కొందరు రైతులు వర్షాల నీటికి వరి నాట్లు వేశారు. భారీ వర్షాలు కురిసి ఎస్సారెస్పీ నిండితే అక్కడ నుంచి వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు నీటిని విడుదల చేయనున్నారు. అక్కడి నుంచి ఎల్ఎండీకి గేట్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు.

- ఎల్ఎండీలో ప్రస్తుతం ఆరు టీఎంసీల నీళ్లు ఉండగా, పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవాలంటే ఇంకా 18 టీఎంసీల నీరు అవసరం. మిడ్‌మానేరులో కూడా నీళ్లు తక్కువగా ఉండడంతో పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ప్రతిరోజు ఒక టీఎంసీలకు పైగా నీటిని నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా ఎత్తిపోస్తున్నారు. ప్రస్తుతం నీటిమట్టం 14 టీఎంసీలకు చేరుకున్నది. మరో 13 టీఎంసీల నీళ్లు ప్రాజెక్టులోకి వస్తే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోనున్నది. ఈ 15 రోజులు భారీ వర్షాలు కురిసి ఎస్ఆర్ఎస్పీ నిండితే మాత్రం మిడ్ మానేరు, ఎల్ఎండిలకు నీటిని విడుదల చేయనున్నారు. దీంతో ఎల్ఎండీ దిగువ ఆయకట్టుకు ఆగస్టు రెండో వారంలో కానీ, మూడో వారంలో కానీ నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి.

డీఎస్సీ పరీక్షకు 232 మంది అభ్యర్థులు హాజరు

పెద్దపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం డీఎస్సీ పరీక్షకు 232 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ నియామకాల పరీక్షకు మొత్తం 309 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 232 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మంథని జేఎన్టీయూలో 202 మంది అభ్యర్థులకు 151 మంది, పెద్దపల్లిలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో 85 మంది అభ్యర్థులకు 63 మంది, ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 22 మంది అభ్యర్థులకు 18 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యాశాఖ పరంగా ఒక అబ్జర్వర్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని డీఈవో తెలిపారు.

ఢిల్లీకి బీసీ సంక్షేమ సంఘం సభ్యులు


ఢిల్లీకి వెళ్తున్న బీసీ సంక్షేమ సంఘం సభ్యులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 5: రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు పెద్దపల్లి జిల్లా నుంచి బీసీ సమస్యల సాధనలో భాగంగా సోమవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ నెల 6, 7 తేదీలలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరుగనున్న ధర్నా విజయవంతం చేసేందుకు పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు తాడూరు శ్రీమన్నారాయణ నాయకత్వంలో పలువురు పెద్దపెల్లి జిల్లావాసులు పెద్దపల్లి, రామగుండం స్టేషన్ల నుంచి ఢిల్లీకి తరలి వెళ్లారు. చట్ట సవరణలో బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం సాధనతో పాటు దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని ప్రధాన డిమాండ్లతో పలువురు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో పెద్దపెల్లి జిల్లాకు చెందిన స్వామి వివేక్ పటేల్, రాజన్న పటేల్, రాజేందర్, సుగుణాకర్ తదితరులు ఉన్నారు.

ఉన్నత విద్యలో వస్తున్న మార్పులపై సదస్సు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 5: మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని క్రెసెంట్ పాఠశాల, బీఎడ్ కళాశాలలో ఉన్నత విద్య, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్కాలర్‌షిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత కేంద్ర కో ఆర్డినేటర్ దయా అరుణ మాట్లాడుతూ ఉన్నత విద్యలో వస్తున్నటువంటి మార్పులు, ప్రభుత్వ స్కాలర్షిప్ ప్రాముఖ్యత, మహిళల్లో వస్తున్న పలురకాల వ్యాధులపైన, మహిళా సాధికారత నేపథ్యంపై విద్యార్థులతో చర్చించారు. అలాగే జెండర్ స్పెషలిస్టులు జే. సుచరిత, సీ.హెచ్. స్వప్న మాట్లాడుతూ లింగ వివక్షత, లింగ నిర్ధారణ, టోల్‌ఫ్రీ నెంబర్లు, సైబర్ నేరాల గురించి వివరించారు. స్పెషలిస్టు ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ ఎస్. సంధ్యారాణి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అయాస్, ప్రిన్సిపాల్ జవ్వాజి రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ జెబా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి

- అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు


న్యాయవాదులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న అదనపు జిల్లా న్యాయమూర్తి

కోల్‌సిటీ , ఆగస్టు 5: న్యాయవాదుల సంక్షేమానికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జారీ అయిన హెల్త్‌కార్డులను సోమవారం గోదావరిఖని బార్ అసోసియేషన్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమంలో ప్రభుత్వాల పాత్ర కీలకమన్నారు. జూనియర్ న్యాయవాదులు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం హెల్త్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మంజుల, వెంకటేష్‌దుర్వ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, ప్రధా నకార్యదర్శి జువ్వాజి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ నాకులు గుజ్జేటి సత్యనా రాయణ, మహేందర్, లింగస్వామి, భానుకృష్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో జీలకుంట యువకుడి మృతి

ఓదెల, ఆగస్టు 5: మండలంలోని జీలకుంటకు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో మృతిచెందాడు. ఆదివారం రాత్రి జీలకుంట గ్రామానికి చెందిన రాగిడి సందీప్‌రెడ్డి (29) హైదరాబాద్‌లో స్విమ్మింగ్ పూల్‌లో మృతిచెందడంతో అతని కుటుంబంలో దిక్కుతోచని స్థితికి చేరింది. జీలకుంట నుంచి ఐదుగురు వ్యక్తులు హైదరాబాద్‌లోని బిస్కెట్ కంపెనీలో కూలి కోసం వెళ్లగా స్విమ్మింగ్ పూల్‌లో మృతిచెందడంపై గ్రామంలో పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కీసర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

రుణమాఫీ ఫలాలు రైతులకు అందాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ పథకం ఫలాలు రైతులకు చేరే విధంగా బ్యాంకర్లు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బ్యాంకర్లను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రైతు రుణమాఫీ, ఇందిరా మహిళాశక్తి తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి బ్యాంకర్లతో డీసీసీ , డీ.ఎల్.ఆర్.సి సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షమాట్లాడుతూ, 2 లక్షల రుణమాఫీలో భాగంగా ప్రభుత్వం రెండు విడుతలలో లక్షన్నర వరకు రుణాలు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేశాయని, జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 42 వేల 965 మంది రైతులకు దాదాపు 271 కోట్ల రుణమాఫీ జరిగిందని అన్నారు. ప్రభుత్వ రైతుల రుణాలు మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసినందున రుణమాఫీ ఫలాలు సదరు రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రుణమాఫీ సంబంధించి మండలంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు కేంద్రాల ద్వారా రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1864 కోట్ల రూపాయల పంట రుణ లక్ష్యానికి జూన్ చివరి నాటికి 266 కోట్లు, 651 కోట్ల రూపాయల వ్యవసాయ టర్మ్ రుణాలకుగాను దాదాపు 154 కోట్ల రుణాలు అందించామని అధికారులు తెలిపారు. పంట రుణ లక్ష్యాలను నూరు శాతం చేరుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూలై నాటికి 948 స్వశక్తి సంఘాలకు 81 కోట్ల 25 లక్షలు, మెప్మా కింద 91 సంఘాలకు 10 కోట్ల 63 లక్షల బ్యాంకు రుణాలు అందించామని అధికారులు తెలిపారు. జూలై మాసం చివరి నాటికి


బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష

నిర్దేశించుకున్న లక్ష్యంలో 60 శాతం మాత్రమే పూర్తి కావడానికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో ప్రధానమంత్రి స్వానిధి కింద రెండవ సారి 8 వేల 368 మందికి పంపిణీ చేశామని, ఆర్.పిలు, బ్యాంకర్లు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పీఎం స్వానిధి రెండో విడత కింద తిరిగి చెల్లించిన వారికి మూడవ విడత రుణాలు మంజూరు అయ్యేలా చూడాలని ఆదేశించారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు వివిధ పథకాల కింద యువతకు రుణాలు అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. పీఎం విశ్వకర్మ పథకం పట్ల విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియ నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారందరికీ పథకం అమలయ్యే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్ , డి .ఆర్.డి.ఓ.రవీందర్ రాథోడ్, వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్‌లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండు రెస్టారెంట్ల సీజ్

జ్యోతినగర్,ఆగస్టు 5: ట్రేడ్ లైసెన్స్ లేని రెండు రెస్టారెంట్లను రామగుండం నగరపాలక సంస్థ అధికారులు సోమవారం సీజ్ చేశారు.ఎఫ్‌సిఐ క్రాస్‌రోడ్డులోని రెస్టారెంట్, ఎన్టీపీసీలోని మరో రెస్టారెంట్ గత కొన్ని నెలలుగా చెల్లుబాటులో ఉన్న డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్ లేకున్నప్పటికీ వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గమనించిన నగర పాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు.నోటీస్‌లకు సదరు రెస్టారెంట్ల నిర్వాహకుల నుంచి స్పందన రాక పోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు నగర పాలక సంస్థ హెల్త్ అసిస్టెంట్ కిరణ్ తెలిపారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలన్నారు.

అండర్-16 క్రికెట్ టీంకు ఎంపిక

కమాన్‌పూర్, ఆగస్టు 5 : మండల కేంద్రానికి చెందిన నల్లొండ రవి కుమారుడు నల్లొండ చంద్ర ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-16 క్రికెట్ టీంకి ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో నల్లొండ చంద్ర ఎంపిక కావడం పట్ల కమాన్‌పూర్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 5 : మండలంలోని సబ్బితం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అబ్దుల్ పాషాను సోమవారం గ్రామ మహిళ సంఘాల వివోలు, సభ్యురాళ్లు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు అనిత, రేవతి, వివో అధ్యక్షులు వసంత, రాజమణి, మహిళ సంఘాల సభ్యులు రజిత, వరలక్ష్మీ, తేజశ్రీ, అనిత, చిటుకమ్మా, స్వరూప, సరోజన, రాధ, లక్ష్మీ, రాధికలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రామగుండంలో వేగవంతంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్

జ్యోతినగర్, ఆగస్టు 5 : రామగుండం నగర అభివృద్ధిని వేగవంతం చేశామని, ఎన్నికల కోడ్ కారణంగా ఆగిన పనులను త్వరగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ తెలిపారు. సోమవారం స్థానిక మేడిపల్లి సెంటరులో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తోపాటు మరో వారం రోజుల్లో 100 కోట్ల రూపాయలతో రామగుండం కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఇప్పటికే 100 కోట్ల రూపాయల పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, కొద్ది రోజుల్లో ఆయా అభివృద్ధి పనులను మొదలు పెట్టి త్వరగా పూర్తి చేస్తామన్నారు. ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను చేపడుతామని, వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాగా, 2 కోట్ల రూపాయలతో 23, 2, 3, 4, 5 డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మేయర్ అనిల్ కుమార్, మున్సిపల్ కమీషనర్ సిహెచ్.శ్రీకాంత్, కార్పొరేటర్లు కొలిపాక సుజాత, శ్రీనివాస్, మహంకాళి స్వామి, ముస్తాఫా, ధాతు శ్రీనివాస్, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

పనులు పూర్తికాక ప్రజల ఇబ్బందులు


కరీంనగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి కింద నిలిచిన నీరు

పెద్దపల్లి రూరల్,ఆగస్టు5: మండలంలోని పెద్దబొంకూర్ - దస్తగిరిపల్లి గ్రామాల మధ్య కరీంనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిత్యం వరదనీరు నిలుస్తుండటంతో పలుమార్లు ఫిర్యాదు చేయగా పనులు చేపట్టారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో అటువైపు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు

సుల్తానాబాద్, ఆగస్టు 5: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి ఇందులో భాగస్వాములు కావాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలో ప్రారంభించారు. పలు వార్డుల్లో కమిషనర్‌తో కలసి మొక్కలు నాటారు. అనంతరం కార్యక్రమం గురించి ప్రధాన వీధుల గుండా స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గాజల లక్ష్మి మాట్లాడుతూ ఈ నెల ఐదు నుంచి తొమ్మిది వరకు మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుందని అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం శోభా శంకర్, మేనేజర్ అలీం, మున్సిపల్ వైస్ చైర్మన్ బిరుదు సమత క్రిష్ణ, పీహెచ్‌సీ డాక్టర్లు, ఏఎన్ఎంలు, మెప్మా ప్రతినిధులు, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్ శోభా శంకర్


సుల్తానాబాద్‌లో మొక్కనాటి నీరుపోస్తున్న చైర్‌పర్సన్

కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శోభా శంకర్

సుల్తానాబాద్ : ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలసి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ శోభా శంకర్ అన్నారు. సుల్తానాబాద్‌లో పనిచేసిన కమీషనర్ కట్ల వేణుమాధవ్ కరీంనగర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో హైదరాబాద్ సీడీఎంఏలో మిషన్ డైరక్టర్ మెప్మా విభాగంలో పనిచేస్తున్న శోభా శంకర్ సుల్తానాబాద్ కమిషనర్‌గా బదిలీపై వచ్చి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లును కలసి పుష్పగుచ్ఛం అందించారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

ఓదెల, ఆగస్టు 5: మండల కేంద్రంలో జండా వద్ద రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం పట్టుకున్న నల్లవేని శంకర్ విద్యుదా ఘాతంతో కిందపడిపోయాడు. అక్కడ ఉన్న మెడికల్ షాప్ వద్దకు మందుల కోసం వచ్చిన శంకర్ అనుకోకుండా విద్యుత్ స్తంభాన్ని పట్టుకోవడంతో ప్రమాదం జరిగింది. కిందపడి పోయిన శంకర్‌ను సమీపంలోని యువకులు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రమాదక రంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని అక్కడినుంచి తొలగించాలని తెలిపినప్పటికీ ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. దీనిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

మొరాయించిన రైల్వే గేట్

● అరగంటకు పైగా నిలిచిన రాకపోకలు

మల్యాల, ఆగస్టు 5: మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలోని రామన్నపేటకు వెళ్లే మార్గంలో గల రైల్వే గేట్ సోమవారం సాయంత్రం మొరాయించింది. రైలు రావడంతో అక్కడి సిబ్బంది గేట్లు వేశారు. అయితే రైలు వెళ్లాక అరగంట గడిచినప్పటికీ గేట్లు తెరచుకోకపోవడంతో ఇరువైపుల వాహనాలు, స్కూల్‌బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైలు పట్టాల మధ్య సాంకేతిక లోపం ఏర్పడడంతో గేట్లు తెరచుకోలేదని గేట్‌మన్ తెలిపాడు. పట్టాల మధ్య సరి చేశాక కాసేపటికీ గేట్లు తెరచుకోవడంతో వాహనదారులు వెళ్లిపోయారు. కొన్ని నెలల క్రితం కూడా ఇలాగే గేట్లు మొరాయించాయి.

చీటి వ్యాపారిపై కేసు నమోదు

మల్లాపూర్, ఆగస్టు 5 : మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన ఆకుల గంగాధర్‌గౌడ్ చీటి వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మొగిలిపేట గ్రామంలో ఆకుల గంగాధర్‌గౌడ్ చీటి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన సంగం పెద్దగంగారాం, ముక్కెర లక్ష్మీ కట్టిన చీటి డబ్బులు చెల్లించాలని గంగాధర్‌గౌడ్‌ను పలుమార్లు బాధితులు కోరగా తనకే ఇంకా డబ్బులు రావాల్సి ఉందని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సంఘం పెద్ద మనిషి పెద్దగంగారాం మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.




బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డి, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

తిరుమల తిరుపతి తరహాలో

బ్రేక్ దర్శనం అమలు

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 5 : తిరుమల తిరుపతి తరహాలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం బ్రేక్ దర్శనం అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజన్న ఆలయంలో శ్రావణమాసం మొదటి రోజు సోమవారం బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను ఆలయ ఈవో వినోద్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ బ్రేక్ దర్శనం టికెట్ కొనుగోలు చేసి క్యూలైన్ ద్వారా రాజన్న ఆలయంలోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు శీఘ్ర దర్శనం కలిగేలా ఒక మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. యాదాద్రి తిరుమలతిరుపతి దేవస్థానం తరహాలో వేములవాడ రాజన్న ఆలయంలో కూడా ప్రతి భక్తుడికి శీఘ్రదర్శనం కలిగేలా బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ప్రతీ రోజు ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు బ్రేక్ దర్శనం ఉంటుందని తెలిపారు.

రాజన్న ఆలయానికి గత పాలకులు ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి మూడు నెలల్లోనే వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి రూ. 20 కోట్లు నిధులు వెనక్కి తీసుకొచ్చామన్నారు. మొన్నటి బడ్జెట్ రాజన్న ఆలయానికి రూ.50 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, నాయకులు సాగరం వెంకటస్వామి, సంఘస్వామి యాదవ్, కనికరపు రాకేష్, తూం మధు, గూడూరి మధు, పుల్కం రాజు, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్ ఉన్నారు.

రాజన్న ఆలయానికి శ్రావణ శోభ

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయం శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రారంభించిన బ్రేక్ దర్శనం ద్వారా మొదటి రోజున 96 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మహాలింగార్చన

శ్రావణ సోమవారం సందర్భంగా అర్చకులు ఉదయం 5.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారి కల్యాణ మండపంలో సాయంత్రం 6.05లకు లింగాకృతిలో దీపాలను వెలిగించి మహాలింగార్చన చేపట్టారు. ఆలయ ఓపెన్ స్లాబ్‌లో నైమిశారణ్య పీఠం పూజ్యా శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి భక్తులకు శివలీల విలాసం ప్రవచనం వినిపించారు.



ప్రవచనం వినిపిస్తున్న శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి

ఆలయాల్లో భక్తుల రద్దీ

ధర్మపురిలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం

ధర్మపురి, ఆగస్టు 5: ధర్మపురి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని మొదటి సోమవారం స్థానిక లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ ఉగ్ర నరసింహ, వేం కటేశ్వర, రామ లింగేశ్వర స్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. రామలింగేశ్వర స్వామి వారలకు మహారుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీని వాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీని వాసాచారి, రమణాచార్య నంబి నరసింహమూర్తి, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభి షేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శివుడికి భక్తి శ్రద్ధలతో పూజలు

రామలింగేశ్వర స్వామి, సమీపంలో గల అక్కపల్లి రాజరాజేశ్వరుని ఆలయం వద్ద భక్తుల రద్దీ పెరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి అర్చకులు రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు, అన్నపూజ నిర్వహించారు. అంతకు ముందు గోదావరి నదిలో స్నానాలు చేసి, ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు క్యూలైన్ ద్వారా వెళ్లి స్వామి వారలను దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్ శర్మ, అర్చకులు విశ్వనాథశర్మ, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొండగట్టులో శ్రావణ సప్తాహ ఉత్సవాలు

మల్యాల, ఆగస్టు 5: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాస సప్తాహ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ప్రధాన ఆలయ మండపంలో విశ్వక్సేనా రాధన, వాసుదేవ పుణ్య హవచనం, రక్షబంధనం, రుత్విక్‌వరుణం, దీక్ష స్వీకరణ, అంజనేయ స్వామికి పంచామృతా భిషేకం,తుళసీదళర్చాన, వెంకటేశ్వరస్వామి, అమ్మవారికి అభిషేకార్చన నిర్వహించారు. సాయంకాలం అమ్మవారికి సహస్రనామా కుంకుమార్చన, వేంకటేశ్వర స్వామికి తిరువీధి సేవ నిర్వహించిన అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.ఈ ఉత్సవాలలో ఏఈవో అంజయ్య, స్థానాచార్యులు కపీంధర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, అధికారులు సునీల్, చంద్రశేఖర్, సంపత్, ఉమామహేశ్వర్, రాజేందర్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొనసాగుతున్న నీటి విడుదల

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 5: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు ప్రాజెక్టులోకి 7,822 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది పంప్ హౌస్ నుంచి మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.091 టీఎంసీలు ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గిపోవడంతో నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం సాయంత్రం నుంచి ఒక మోటార్ నిలిపి వేసి మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో తగ్గడంతో సోమవారం అర్ధరాత్రి నుంచి ఒక పంపును నిలిపివేసి మూడు పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మొదటి రెండు రోజులు ఐదు పంపుల ద్వారా రోజుకు 15,750 క్యూసెక్కుల విడుదల చేశారు. మూడో రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు నాలుగు పంపాల ద్వారా రోజుకు 12,600 క్యూసెక్కుల నీటిని తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్ హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 9.8 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12600 క్యూసెక్కులు, మానేరు, ములవాగు ద్వారా 200 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్థి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.533 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు ప్రారంభం

ఇల్లంతకుంట: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు సోమవారం ప్రారంభయయ్యాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.76 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. మధ్యమానేరులో 10.03 టీఎంసీల నీరు ఉండడంతో రాష్ట ప్రభుత్వం ఎత్తిపోతలను ప్రారంభించింది. రెండు మోటార్ల ద్వారా 6,400 టీఎంసీల నీటిని ప్రతీ రోజు అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయడం ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి విడుదలవుతున్న నీరు

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ఎస్సారెస్పీలోకి 13,167 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 44.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యం

- రూ. 2కోట్ల ప్రభుత్వ ధాన్యాన్ని అమ్ముకున్న వ్యాపారి...? ● సీఎంఆర్ ధాన్యం ఇచ్చింది ఒకరికి... బియ్యం అడుగుతుంది మరొకరిని...!



హుజూరాబాద్, ఆగస్టు 5: జిల్లా సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యంతో సీఎంఆర్ ధాన్యం మాయమైంది. హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ సమీపంలో పరమేశ్వర ఇండస్ట్రీస్ యజమాని ఓరుగంటి సమ్మిరెడ్డి 2016లో తన మిల్లును సత్యనారాయణ అనే వ్యాపారికి లీజ్‌కు ఇచ్చాడు. అప్పటి నుంచి సమ్మిరెడ్డి అనారోగ్య కారణంగా హైద్రాబాద్‌లో కొడుకుల వద్ద ఉంటున్నాడు. ఇదే అదునుగా చూసుకొని సత్యనారాయణ మిల్లు యజమాని సమ్మిరెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసి ప్రతి ఏటా ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని తీసుకుని బియ్యాన్ని ప్రభుత్వానికి పెడుతున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో ఉన్న ధాన్యం రికవరీ చేయాలని సివిల్ సప్లయిస్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో 2022 సంవత్సరానికి సంబంధించిన సుమారు రెండు కోట్ల రూపాయల ధాన్యం సత్యనారాయణ బాకీ ఉన్నట్లు తేలింది. సివిల్ సప్లయిస్ అధికారులు వచ్చి మిల్లును తనిఖీ చేయగా, ధాన్యం మొత్తం అమ్ముకున్నట్లు తెలిసింది. ఇంతలోనే సదరు వ్యాపారి సత్యనారాయణ అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న సివిల్ సప్లయిస్ అధికారులు సత్యనారాయణకు నోటీసులు పంపించినా ఎవరు స్పందించలేదు. ప్రతి ఏటా మిల్లులో ధాన్యం ఉందా లేదానని చూసుకోవాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు అటూ వైపు కన్నెత్తి చూడలేదు. అనంతరం సివిల్ సప్లయిస్ అధికారులు మిల్లు యజమాని సమ్మిరెడ్డి వద్దకు వెళ్లి 16 ఏసీకేల బియ్యం సత్యనారాయణ ప్రభుత్వానికి బకాయి ఉన్నాడని, దానిని నువ్వే చెల్లించాలని సమ్మిరెడ్డిని హెచ్చరించారు. తనకు వడ్లతో సంబంధం లేదని, సత్యనారాయణను అడగాలని తెలిపినా సమ్మిరెడ్డికి సివిల్ సప్లయిస్ అధికారులు నోటీసులు పంపించారు. ఈ విషయంపై తనకు సంబంధం లేదని సమ్మిరెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి తప్పులు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సివిల్ సప్లయిస్ అధికారులపై సమగ్ర విచారణ జరపాలని మిల్లు యజమాని సమ్మిరెడ్డి కోరారు.

వాగులో పడి వ్యక్తి మృతి

ఓదెల, ఆగస్టు 5: మండలంలోని పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి రాజేశం (45) హుస్సేన్ మియా వాగులో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేశం ఆదివారం ఉదయం 10 గంటలకు పొలం పనులకు అని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోగా కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం హుస్సేన్‌మియా వాగులో శవం తేలిఉండటంతో మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

'ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి'

రామడుగు, ఆగస్టు 5: వెలిచాల గ్రామానికి చెందిన కుతాడి కనకయ్యను గొర్రెల దొంగతనం చేశానని ఒప్పుకోవాలని హింసించిన రామడుగు ఎస్ఐ సురేందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ సంఘాల నాయకులు సోమవారం సీపీ అభిషేక్ మొహంతికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి తిప్పరపు సురేష్, న్యాయవాదుల సంఘం నాయకుడు బీఆర్ఎస్ చొప్పదండి నాయకుడు కట్టెకోల లక్ష్మణ్‌కుమార్, కొంపల్లి సాగర్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



రాజశేఖర్ (ఫైల్)

కొడిమ్యాల, ఆగస్టు 5: మండలంలోని పూడూర్ గ్రామంలోని బీరప్పస్వామి గుడి సమీపంలో అదే గ్రామానికి చెందిన కందుల రాజశేఖర్ (30) సోమవారం తెల్లవారుజామున దారుణ హత్యకు గురయ్యాడు. కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు పూడూర్ గ్రామానికి చెందిన కందుల రాజశేఖర్ గ్రామంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన రాజశేఖర్ తిరిగి రాకపోవడంతో సోమవారం వేకువజామున అతడి తల్లి ఆచూకీ తెలుసుకునేందుకు వెళ్లింది. ఇంటి సమీపంలోని బీరప్పస్వామి గుడి వద్ద రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉన్న కొడుకును గుర్తించింది. గుర్తు తెలియని వ్యక్తులు రాజ శేఖర్ తలపై కట్టెతో కొట్టి, నోట్లో మట్టి పోసి హత్య చేశారు. అనంతరం నిందితులు రాజశేఖర్ ద్విచక్ర వాహనం నుంచే పెట్రోలు తీసి శరీరంపై పోసి కాల్చడానికి ప్రయత్నించారు. పోలీసుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి చేరుకుని వివరాలు సేకరించారు. రాజశేఖర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లూస్ టీం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. హత్య జరిగిన సమీప ప్రాంతాల్లో కొద్ది రోజులుగా కొందరు యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

తమ కుమారుడిని హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న పూడూర్‌లో ధర్నా చేశా రు. సమాచారం అందుకున్న మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ అక్కడికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిందితులను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ధర్నాను విరమించారు.

రెస్టారెంట్ యజమాని ఆత్మహత్య



లక్ష్మీరాజం (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 5: వ్యాపారంలో నష్టం వచ్చిందని మనస్తాపంతో సిరిసిల్ల పట్టణం లోని గాంధీనగర్‌లో కొండ లక్ష్మీరాజం (36) అనే రెస్టారెంట్ అండ్ బేకరీ యజమాని సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన లక్ష్మీరాజం సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో నివాసం ఉంటూ గాంధీనగర్ కూరగాయల మార్కెట్ వీధిలో అన్‌లిమిటెడ్ రెస్టారెంట్, బెకరీని నడిపిస్తున్నాడు. వ్యాపారానికి రూ.40 లక్షల వరకు పెట్టుబడి కావడంతో అప్పులు చేశాడు. దీంతో తనకు వంశపారంపర్యంగా వచ్చిన స్థలాలను విక్రయించి అప్పులు తీర్చేశాడు. వ్యాపారంలో నష్టం రావడం, ఆస్తి విక్రయించడంతో మనస్తాపం చెందాడు. ఎప్పటిలాగే తన ఇద్దరు కూతుళ్లను స్కూల్‌లో దింపేసి గాంధీనగర్‌లో ఉన్న హోటల్‌కు చేరుకొని వెనుక గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కొంత కాలంగా హోటల్‌లో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులతో తన భర్త లక్ష్మీరాజం ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య వైశాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

నకిలీ ఫోన్‌పే యాప్‌తో యువకుడి మోసం

మంథని, ఆగస్టు 5: నకిలీ ఫోన్ పే యాప్ ద్వారా మోసానికి పాల్పడుతున్న ఓ యువకుడిని మంథనిలో పట్టుకున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడు ఈజీ మనీకి అలవాటు పడి ఫేక్ ఫోన్ పే యాప్‌ను తన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. ఈ నకిలీఫోన్ పే ద్వారా ట్రాన్సాక్షన్ చేసినట్టు మాత్రమే కన్పిస్తుంది కానీ ఎదుటి వారి ఖాతాలో ఎలాంటి డబ్బులు జమ కావు. ఈ యాప్ ద్వారా రాజ్‌కుమార్ పట్టణంలోని త్రినేత్రి ఆన్‌లైన్ షాపులోని స్కానర్‌కు డబ్బులు పంపించాడు. ఆన్‌లైన్ ద్వారా రూ. 5 వందలు చెల్లించానని, డబ్బులు ఇవ్వాలని కోరాడు. తన ఖాతాలోకి డబ్బులు జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన షాపు నిర్వాహకుడు అంబటి సాయి తన స్నేహితుల సాయంతో అది ఫేక్ యాప్ అని నిర్ధారించుకొని అతన్ని పట్టుకున్నాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా పోలీసులు నిందితుడిని పోలీస్టేషన్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మంథనిరూరల్, ఆగస్టు 5: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దాసరి ఓదెలు(60) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య దాసరి లక్ష్మి కథనం ప్రకారం.. ఓదెలు 5 సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడని, ఆదివారం మధ్యాహ్నం తమ పత్తి చేను నుంచి వెళ్లిన ఓదెలు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని తెలిపింది. చికిత్స కోసం మంథనికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించామని చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపింది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 5: భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని మానసిక వేదనకు గురైన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. ఆరోగ్యం క్షీణించి సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లద్నాపూర్ గ్రామానికి చెందిన పులి లక్ష్మీ తన కూతురు నవ్యను పెద్దపల్లి మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన బాలసాని జంపయ్యకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. భర్త జంపయ్య వేరే మహిళతో సంబంధం పెట్టుకోగా విషయం తెలిసిన బాలసాని నవ్య (35) మనస్తాపానికి గురై జూలై 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లో చికిత్స అందించారు. అయినా ఆరోగ్యం క్షీణిస్తుండటంతో హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆర్థికస్తోమత లేకపోవడంతో స్వగ్రామం ముత్తారం తీసుకొచ్చారు. ఆరోగ్యం క్షీణించి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు మహిళ కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

చిరుత దాడిలో దూడ మృత్యువాత

గంభీరావుపేట, ఆగస్టు 5 : మండలంలోని దమ్మన్నపేట సమీపాన ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి దూడను చంపేసింది. గోరంటాల గ్రామ సమీపంలో ఇటీవల చిరుత దాడిలో రెండు ఆవులు చనిపోయిన సంఘటన మరవక ముందే దమ్మన్నపేట గ్రామ సమీపాన వీరబోయిన నారాయణ అనే రైతుకు చెందిన దూడ చిరుత దాడిలో మృతి చెందింది. పెద్దమ్మ అటవీ ప్రాంత శివారు గ్రామాలైన గోరంటాల, దమ్మన్నపేట రైతులకు చెందిన మూగజీవాలను చిరుత చంపుతుండడంతో భయందోళనలు నెలకొన్నాయి. ఫారెస్ట్ అధికారులు స్పందించాలని, చిరుత బారి నుంచి కాపాడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్ పరిశీలించారు.

‘స్వచ్ఛదనం- పచ్చదనం’లో భాగస్వాములు కావాలి



జెండా ఊపి ర్యాలీ ప్రాంభిస్తున్న కలెక్టర్



సబ్బితంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో గంగయ్య



రామగుండంలో ర్యాలీ నిర్వహిస్తున్న మేయర్, అధికారులు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 5: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో మున్సిపాల్టీ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానం నుంచి అమర్‌నగర్, మజీద్ చౌరస్తా, జండాచౌరస్తా, కమాన్ మీదుగా కళాశాల మైదానం వరకు మున్సిపల్ కౌన్సిలర్లు,పాఠశాల విద్యార్థులు,పాఠశాల యాజమాన్యం,మెప్మా ఆర్పీలు, ఓబీలు, మెడికల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు,రెడ్ క్రాస్ సొసైటీ, లైయన్స్ క్లబ్,యూత్ సభ్యులతో నిర్వహించిన కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. వ అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్)అరుణశ్రీ మున్సిపల్ కౌన్సిలర్లు , ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు చేత కళాశాల మైదానంలో మొక్కలు నాటించారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా అట్టి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది చేత కళాశాల మైదానంలో శ్రమదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మేనేజర్ శివప్రసాద్, ప్రమోద్ కుమార్, ఏఈ సతీష్, వినయ్, ప్రవీణ్, ట్రాఫిక్ సీ అనిల్, ఎస్సై లక్ష్మన్ ,జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, సురేందర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్లు రామ్మోహన్ రెడ్డి పులిపాక రాజు, మౌనిక, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్: గ్రామాల్లో ఎక్కడ చూసినా స్వచ్ఛమైన వాతావరణం కనిపించేలా మొక్కలు నాటాలని పెద్దపల్లి ఆర్డీవో , మండల ప్రత్యేకాధికారి గంగయ్య అన్నారు. సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మండలంలోని సబ్బితం గ్రామంలో ఆర్డీవో గంగయ్య ప్రారంభించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన ప్లాంటేషన్‌ను ఆర్డీవో పరిశీలించి మొక్కలను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్, ఏపీవో రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి అబ్బల్ పాష, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్‌తో పాటు మహిళ సంఘాల సభ్యురాళ్ల, గ్రామస్థులు పాల్గొన్నారు.

● కోల్‌సిటీ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం, పచ్చదనంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డివిజన్‌లోని పెద్ద కాలువ దాటడానికి యుద్ధ ప్రాతిపదిన కొత్త వంతెన నిర్మించాలని అధికారులను ఆదేశించారు. గుంతల్లో నీరునిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన రోడ్లు, అవసరమైన అభివృద్ధి పనుల జాబితా సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో రోడ్ల శుభ్ర పర్చడం, కూలర్లలో నీటిని తొలగించడం, ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లు, పొదల తొలగింపు, కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లం, తడిచెత్త, పొడి చెత్త మున్సిపల్ సిబ్బందికి అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

●ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రారంభించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఆగస్టు 5నుండి 9వరకు జరుగనుంది. పంచాయతీలలో గ్రామస్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి భాస్కర్, ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీఎం సుధాకర్, ఏవో ఉమాపతి, డాక్టర్ నిస్సిక్రిష్టాన, మాజీ ప్రజా ప్రతినిధులు, ఐకేపీసిసిలు జ్యోతి, మల్లేశం, ఆనంద్, వివోఏ,అంగన్వాడీ, ఏఎన్ఎంలు, ఆశాలు, మహిళ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● సుల్తానాబాద్ : స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాలను సోమవారం మండలంలోని అన్ని గ్రామాలలో ప్రారంభించారు. ఆయా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, మహిళ సంఘాలవారు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామాలలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థుల చే అవగాహన ర్యాలీలు నిర్వహించారు. చౌరస్తాల వద్ద మానవహా రం గా ఏర్పడి మొక్కలు నాటడం అవశ్యకతను వివరించారు. గర్రెపల్లిలలో ఎంపీడీఓ అధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

● జూలపల్లి: మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోను సోమవారం స్వచ్ఛదనం పచ్చదనంపై అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలను సీజనల్ వ్యాదుల నుండి కాపాడేందుకు పారిశుద్యం నిర్వాహన పకడ్బందీగా నిర్వహించాలని, అలాగే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరనాన్ని కాపాడాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమాలలో మండల అదికారులు, ఆయా గ్రామాల పంచాయతి కార్యదర్శులు, పలువురు పాల్గొన్నారు.

● పాలకుర్తి: మండలం పరిధిలోని జయ్యారం,బసంత్‌నగర్ తదితర గ్రామాల్లో సోమవారం స్వచ్ఛదనం- పచ్చదనంపై ర్యాలీలు నిర్వహించారు.అయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి శివయ్య,ఎంపీవో సుదర్శన్,అయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబర్‌లు,అంగన్ వాడి కార్యకర్తలు,అశావర్కర్లు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

● మంథని: ప్రతీ ఒక్కరూ స్వచ్ఛతను పాటిస్తూ.. పచ్చదనాన్ని పెంచాలని ఆర్డీవో హనుమానాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డి అన్నారు. మంథని మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులతో కలిసి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లిఖార్జునస్వామి, వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొండ శంకర్, కౌన్సిలర్లు వీకే. రవి, కుర లింగయ్య, నక్క నాగేంద్ర, గుండా విజయలక్ష్మి ఉన్నారు.

● కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి స్థానిక బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు అధికారులు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటం వలన కలిగే ప్రయోజనాలపై నినాదాలు చేశారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళలు ఆదాయ వనరులు సృష్టించాలి

● రుణాలతో వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి ● కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 5: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద స్వశక్తి మహిళా సంఘాలకు అందించే రుణాలతో మహిళలు ఆదాయ వనరులను సృష్టించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి ప్రోగ్రాంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఇందిరా మహిళాశక్తి ద్వారా మహిళలకు ఆదాయ వనరులు కల్పన దిశగా ప్రభుత్వం రూపొందించిన పలు ప్రణాళికలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ముందుగా వివరించారు. ప్రతి యూనిట్ ఏర్పాటు తీసుకోవాల్సిన చర్యలు, దీని వల్ల కలిగే లాభాలను తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు దాదాపు లక్ష కోట్ల రూపాయల రుణాలు అందజేసి ఆర్థికంగా వారిని బలోపేతం చేయాలని ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని రూపొందించిందని అన్నారు. మహిళా సంఘాలకు వివిధ వ్యాపారాల ఏర్పాటు పట్ల అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేసిందని అన్నారు. పాడి పశువులు, కుట్టు మిషన్ కేంద్రాలు, మీ సేవా కేంద్రాలు, కుటీర పరిశ్రమలు, పౌల్ట్రీ, ఆహార శుద్ధి కేంద్రాలు కస్టం హైరింగ్ సెంటర్స్, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్, మిల్క్ పార్లర్స్ , క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్మెంట్ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ మొదలగు రంగాలలో మహిళలు వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సలహాలు ఇతర సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం అందిస్తుందని అన్నారు. ప్రస్తుత సంవత్సరం జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 500 పాడి పశువుల యూనిట్ల 4 కోట్ల 50 లక్షలతో పంపిణీ ప్రణాళికలు సిద్ధం చేశామని, కరీంనగర్ మిల్క్ డైరీ యూనిట్‌తో వీరిని సమన్వయం చేస్తామన్నారు. జిల్లాలో 5,653 మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌ను కూడా 64 కోట్ల 38 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నామని, ప్రస్తుతం ఉన్న వ్యాపార యూనిట్ల విస్తరణ, నూతన వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో ఉన్న వ్యాపార యూనిట్లు నడిపే మహిళా సంఘాలతో చర్చించి వారి అనుభవాలను కలెక్టర్ తెలుసుకున్నారు. మహిళా సంఘాల ద్వారా మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, జిల్లాలో 27 నూతన మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కే.రవిందర్ పాల్గొన్నారు.

● పెద్దపల్లిటౌన్: విశ్వ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట రాజానందం మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని , 50 ఏళ్లు నిండిన విశ్వబ్రాహ్మణులకు చేతి వృత్తి చేయు వారికి నెలకు ఐదు వేల రూపాయల పెన్షన్ వర్తింప చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి నాగుల మల్యాల కుమారస్వామి, కోశాధికారి నాగవెల్లి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు

● జాతీయ కరాటే పోటీలలో విజయం సాధించిన జిల్లా కరాటే విద్యార్థులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం అభినందించారు. ఆదివారం కరీంనగర్ లోని రాజశ్రీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జాతీయ కరాటే పోటీలలో పెద్దపల్లిలోని స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుపొందారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 5: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జీ.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్లు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. వారు మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మంథని, ఆగస్టు 5: కరీంనగర్ రాజశ్రీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్‌లో మంథని జేకేప షోటోఖాన్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. 15 సంవత్సరాల కుమితే విభాగంలో హాసిని అనే విద్యార్థి గ్రాండ్ ఛాంపియన్ షిప్ ట్రోఫీకి పోటీ పడి రన్నరప్‌గా ట్రోఫీ తీసుకన్నారు. అదే విధంగా పలు విభాగాల్లో బేర ఆదిత్య తేజ, బొడ్డేల్లా ఇంద్రాణి, రాగుల సహస్ర, హాసిని, రాఘవ, అన్ను, సేపూరి మణిదీప్, శ్రావ్య, రోహిత్, కుంట సాయి ప్రణవి, భవ్య శ్రీ, అనుపమ, వడ్లకొండ శ్రీనిత, లక్ష్మణ్, బహంత్ ఉన్నతి, రాతిపల్లి హన్విత, శివాకశి, స్వరమైలు బంగారు, వెండీ, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ మెడల్స్ సాధించిన విద్యార్థులను జేకేప సౌత్ జోన్ ఇన్‌చార్జి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, పెద్దపల్లి జిల్లా ఏస్జీఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా కరాటే మాస్టర్స్ అభినందించారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

కోల్‌సిటీ, ఆగస్టు 5: ఎల్కలపల్లి మండల పరిషత్ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు బండారి సుజాత, ప్రసాద్ దంపతులు నోట్‌బుక్స్, జామెట్రీ బాక్స్‌లు, పండ్లు పంపిణీ చేశారు. తన తండ్రి ద్వితీయ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాన్ని చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్ర మంలో హెచ్ఎం లక్ష్మీనారాయణ, పంచాయతీ సెక్రటరీ రమ్య, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటేలో ఖని విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు5: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన గురునారాయణరెడ్డి మెమోరియల్ ప్రథమ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో గోదావరిఖనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. బ్లాక్ బెల్ట్ కటాస్ విభాగంలో పి.హార్థిక్, ఎం.ముక్తిశ్రీ, పి.ధృవన్, హేమలత మహాజీ, బ్లాక్‌బెల్ట్ కుమితి విభాగంలో ఎం.ముక్తిశ్రీ, హేమలత మహాజీ, కలర్ బెల్ట్ కటాస్ విభాగంలో శ్రీకీర్తి మహాజి, సునేహ సుల్తానా, బి.సహస్ర, సాత్విక్, శ్రీవర్షిని, పవన్‌కుమార్, సాత్విక్, కార్తికేయన్, సుహాస్, విగ్నేష్, సహస్ర, శాన్వి, శివశిష్, కార్తికలు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను, కోచ్ కరాటే శ్రీనివాస్‌లను జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, కార్యదర్శి రమేష్, సీనియర్స్ ఎస్.శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నిదిష్ కుమార్, శుభశ్రీ, అభిజ్ఞ అభినందించారు.

అటవీ అధికారికి సన్మానం

కమాన్‌పూర్, ఆగస్టు 5: మండల కేంద్రానికి చెందిన పల్లె రమేష్ పెద్దపల్లి రెంజ్ రామగుండం సెక్షన్ ఆఫీసర్‌గాను, కుందనపల్లి, కన్నాల ఈస్ట్ ఇంచార్జీ బీట్ ఆఫీసర్‌గా గత ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీ అయ్యారు. బదిలీపై మంథని రెంజ్ బిట్‌పల్లి సెక్షన్, అడవి సోమన్నపల్లికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రానికి నాయకులు, ప్రముఖులు రమేష్‌ను శాలువాతో సత్కారించారు.

బాధితుడికి ఆర్థిక సహాయం అందజేత

రామగిరి, ఆగస్టు 5: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన కడారి మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడని వారి కుటుంబ సభ్యులు మాజీ జడ్పీటీసీ గంటవెంకటరమణరెడ్డికి తెలపడంతో స్పందించి రామగిరి సేవా సమితి సభ్యుల సహకారంతో బాధితుడికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మామిడి హరిష్, పరుశురాం, అంజి, అప్పల కుమార్, వైకుంఠం, కొప్పుల సునీల్, సంతోష్ పాల్గొన్నారు.

టైలరింగ్ సామగ్రి పంపిణీ

రామగిరి, ఆగస్టు5: రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని అంబేద్కర్ నగర్‌లో టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు సోమవారం రేండ్ల కుమారస్వామి-శారద దంపతులు ఉచితంగా కత్తెర్లను పంపిణీ చేపట్టారు. గ్రామంలోని మహిళలకు వలంటీర్లతో ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇప్పించి వారికి ఉచితంగా కత్తెర్లను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా రేండ్లకుమారస్వామి-శారదలను మహిళలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రేండ్ల మధుసూదన్, రౌతు శివ పటేల్, కొప్పుల రాజమౌళి, బూసజగన్, బొద్దుల రవీందర్, సైండ్ల నారయణ, బూడిద సంపత్, తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి

కోల్‌సిటీ, ఆగస్టు 5: గోదావరిఖని వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ కుక్క లక్ష్మీనారాయణ(54) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. గోదావరిఖని వన్‌టౌన్ నుంచి సబ్‌కోర్టులో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 15రోజులుగా శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు భార్య శంకరమ్మ, ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల సీపీ శ్రీనివాస్, ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, న్యాయవాది పులిపాక ప్రవీణ్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

పాలకుర్తి, ఆగస్టు 5: బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఈనెల నాలుగో తేదీన హైదరాబాద్‌లో జరిగిన రోలెస్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు, వెండి కంచు పతకాలను సాధించారని పాఠశాల కోచ్ ఎం.కృష్ణమూర్తి గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మహేంద్ర అభినందించి వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఎం వర్షిత్ గోల్డ్ మెడల్,ఎం చరణ్ సిల్వర్ మెడల్, హేమంత్ సాయి సిల్వర్ మెడల్, గౌతమ్ రిషి బ్రాంజ్ మెడల్, ఎం రిత్విక్ బ్రాంజ్ మెడల్, మని చరణ్ సిల్వర్ మెడల్ సాధించారని కోచ్ తెలిపారు.

ప్రత్యేక అధికారి పర్యటన

రామగిరి, ఆగస్టు 5: మండలంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల ప్రత్యేక అధికారి ఆశలత, ఎంపీడీవో శైలజారాణి ఆదివారంపేట్, పన్నూరు, లద్నాపూర్, రత్నాపూర్ గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. మహిళా సంఘాలకు పరిస రాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలోని పన్నూరులోని కేజీబీవీలో విద్యార్థులకు స్వచ్ఛదనం-పచ్చదనంపై నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్థానిక స్పెషల్ ఆఫీసర్స్ సమక్షంలో స్థానిక పంచాయతీ సెక్రెటరీల ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై ర్యాలీలు నిర్వహించారు.

రచ్చపల్లిలో గ్రామ సభ

మంథనిరూరల్, ఆగస్టు 5: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రచ్చపల్లి గ్రామపంచాయతీ నందు స్పెషల్ ఆఫీసర్ అధ్యక్షతన తొలి రోజు గ్రామసభ నిర్వహించి గ్రామంలో గల సమస్యలను తెలుసుకున్నారు. తర్వాత గ్రామంలోని వీధులలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్లాస్టిక్ వాడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, తడి చెత్త పొడి చెత్తను వేరు చేసే విధంగా అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటుకోవాల్సిందిగా తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల నందు పారిశుధ్య పనులను నిర్వహించడం జరి గింది. స్పెషల్ ఆఫీసర్ దాసరి రాజ్ కుమార్. మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ అడ్మిన్



వాహనాలను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సి రాజు

కోల్‌సిటీ, ఆగస్టు 5: రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల పరిధిలోని పెట్రోకార్, రక్షక్, హైవే పెట్రోలింగ్ పోలీసు వాహనాల పనితీరు, వాటి నిర్వహణపై సోమవారం అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సి రాజు ఎంటిఓలు, ఐటీ కోర్, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో పరిశీలించారు. వాహనాల నిర్వహణ లోటుపాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ రాజు వాహనాల పనితీరు, నిర్వహణ, ట్యాబ్స్, వీహెచ్ఎఫ్ సెట్, జీపీఎస్ పనితీరు తనిఖీ చేసి వారు నిర్వహిస్తున్న విధుల గురించి డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, పీసీఈఆర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, శ్రీధర్, ఐటిసి ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, పెద్దపల్లి జోన్ ఎంటిఓ కన్న మధు, బెల్లంపల్లి ఎంటిఓ సంపత్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, ఎస్ఐరాణి, వినోద్, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ రాము పాల్గొన్నారు.

సీఎంకు వేదపండితుల ఘన స్వాగతం



సీఎం రేవంత్‌రెడ్డికి దేవుడి చిత్రపటాన్ని అందజేస్తున్న వేద పండితులు

కమాన్‌పూర్, ఆగస్టు 5: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అమెరికాలోని న్యూజెర్సిలో కమాన్‌పూర్‌కు చెందిన వేదపండితులు సముద్రాల వేణుగోపాల్ చారి ఘనస్వాగతం పలికారు. అమెరికాలోని న్యూజెర్సి ఎడిషన్‌లో గల సాయిదత్త పీఠం, శివ విష్ణు టెంపుల్‌కు సీఎం రాగా వేదమంత్రాల ఆశీర్వచనాలు అందుకున్నారు. సీఎం వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ఖని శివాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 5: పవిత్ర శ్రావణ మాసం సోమవారంతో ప్రారంభం కావడంతో గోదావరిఖనిలోని శివాలయాలకు శ్రావణ శోభ సంతరించుకుంది. స్థానిక కోదండ రామాలయం శివాలయంలో శ్రావణ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అత్తెణ చంద్రశేఖరశర్మ మంత్రోచ్చరణల మధ్య తెల్లవారుజామున 4గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అలాగే సాయంత్రం అభిషేకాలు, భజనలు కొనసాగాయి. కాగా భక్తులు పెద్దఎత్తున వచ్చిన అభిషేకాలు, పూజలు చేయగా ఆలయాలు కిటకిటలాడాయి. ఆలయ ఈవో ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అలాగే పవర్‌హౌస్‌కాలనీ, జనగామలోని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

సుల్తానాబాద్: పవిత్రమైన శ్రావణ మాసం సోమవారంతో ప్రారంభం కావడంతో భక్తులు అలయాల్లో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. సుల్తానాబాద్ పట్టణ శివారులోని గుడిమిట్టపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు అభిషేకాలు జరుపుకున్నారు. ఆవరణలో ప్రత్యేక వ్రతాలు ఆచరించారు. సుల్తానాబాద్ పట్టణ నడిబొడ్డులోని శివాలయంలో తెల్లవారున నాలుగు గంటలకు అభిషేక పూజలు నిర్వహించారు. మాటూరి ప్రసాద్ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలోని భవానీ శంకర ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో ఆలయ చైర్మన్‌లు పల్లా మురళి, అల్లెంకి సత్యనారాయణ, పారవెల్ల రమేష్, వల్లంకొండ మహేష్ అశోక్ భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: శ్రావణ మాసం సోమవారం నుండి ప్రారంభమైనా సందర్భంగా శైవక్షేత్రమైనా బ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయంలో అర్చకులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా లోక సుభిక్ష కోసం మహన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే గౌరి పూజతో పాటు, మహ హరతి, మంత్రపుష్ప తదితర పూజలు నిర్వహించారు. నేటి నుండి నెల రోజుల పాటు మాంస ఆహారాలను భుజించడం బంద్ చేసి ప్రజలు ఉపవాస దీక్షలతో మాసమంతా పాటించి శ్రావణమాసం పూర్తిదశలో విరమణ చేయడం శ్రావణ మాస ప్రత్యేకత అని అర్చకులు తెలిపారు. అనంతరం 29 న ఆలయంలో సామూహిక బిల్వార్చణ ఘనంగా నిర్వహించనున్నారు.

స్వచ్ఛదనం- పచ్చదనం బహిష్కరణ

కోల్‌సిటీ, ఆగస్టు 5: రామగుండం 12వ డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజిత స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ డివిజన్‌కు నిధులు కేటాయించలేదని, కనీసం చెత్త తీసుకెళ్లేందుకు కూడా ట్రాలీలు రావడం లేదన్నారు. జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్లు కూడా ఇవ్వడం లేదని, శానిటరీ సూపర్‌వైజర్‌ను మార్చి మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు.

కాంట్రాక్టు కార్మికుడికి పరామర్శ

రామగిరి, ఆగస్టు 05: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-1లో ఇటీవల జరిగిన ప్రమాదంలో కంటి గాయాలైన ఆడేపు శ్రీకాంత్‌ను శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబాబు సోమవారం రాత్రి పరామర్శించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తొట్ల తిరుపతి యాదవ్, తొటచంద్రయ్య, వనంరాంచందర్ రావు,వైనాల రాజు, ముస్త్యాల శ్రీనివాస్, గంటవెంటకరమణరెడ్డి, తులసి రాంగౌడ్, చిందం మహేష్, బర్లశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూసాల అంగన్ వాడీలో తల్లిపాల వారోత్సవాలు

సుల్తానాబాద్, ఆగస్టు 5: సుల్తానాబాద్ మండలంలోని పూసాల అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. డాక్టర్ శ్రీజ ముఖ్య అతిథిగా పాల్గొని తల్లులకు, గర్భిణీలకు తల్లిపాల అవశ్యకత గురించి అవగాహన కల్పించారు. పుట్టిన వెంటనే పిల్లలకు తప్పనిసరిగా ముర్రు పాలు పట్టించాలన్నారు. తల్లులకు తీసుకోవాల్సిన ఆరోగ్య ఆహర నియమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సుభాషిణి, వసంత, పద్మ, అంజలి, వినోద, శారధ తది తరులు పాల్గొన్నారు. కాగా కనుకుల గ్రామలోని అంగన్ వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలతో పాటు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.

● కమాన్‌పూర్ : తల్లిపాలే పిల్లలకు ఎంతో శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్ప అన్నారు. మండలంలోని రొంపికుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి.

కార్యదర్శికి సన్మానం

మంథని రూరల్: మండలం పుట్టపాక గ్రామ పంచాయతీకి నూతంగా వచ్చిన పంచాయతి కార్యదర్శి డేగ సరితను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సత్కరించినారు. కార్యక్రమములో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చాట్లపల్లి సంతోష్, సవాయి గణేష్, ఎడ్ల శ్రావణ్, ఇసంపల్లి చంద్రమూర్తి, కన్నూరి రాజబాపు పాల్గొన్నారు.

అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్ కుమార్

పాలకుర్తి, ఆగస్టు5: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని పెద్దపల్లి సీఐ కె.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లిలో బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్.స్వామి, సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు బాధ్యులవుతారన్నారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ప్రతి ఒక్కరూ తమ తమ వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. పత్రాలు సరిగా లేని 42 ద్విచక్ర వాహనాలను, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.